క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు ఏడు అర్జీలు



పొన్నూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులు పాల్గొని ఏడు అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. వాటిలో రెవెన్యూ 4, సర్వే 1, పంచాయతీ రాజ్‌కు సంబంధించి స్వీకరించిన 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని డెప్యూటీ తహసీల్దార్ ఆరేటి మాధవి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19,20వ తేదీన 25 వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 19,21న 9వ వార్డు రైలు పేట ఆదికుమార్ మున్సిపల్ స్కూల్, 19,23న ఒకటో వార్డు భావనగర్ కాలనీ సాయి ఆదర్శ హైస్కూల్, 21,23న 25 వార్డు ఇటికంపాడు రోడ్డు శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్, 22,23న 8వ వార్డు నిడుబ్రోలు ఏపి స్కూల్, 28,30న 26వ వార్డు పాత పొన్నూరు శ్రీ రామ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, 7 వార్డు డీవీసీ కాలనీ మున్సిపల్ స్కూల్, ఒకటో వార్డు భావనగర్‌కాలనీ శ్రీ వేద హైస్కూల్‌లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'పాడనా తెలుగు పాట'కు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాలను వెలికితీయడంతో పాటు వాటిని యువతకు చేరవేసే లక్ష్యంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'పాడనా తెలుగు పాట' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఘంటసాల- ఎస్పీ బాలు వేదికపై తెలుగు పాటకు నీరాజనంగా ప్రతిభావంతులైన గాయనీ, గాయకులకు గానం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచి సాహిత్యం కలిగిన రెండు తెలుగు చలన చిత్ర గీతాలను కరోకే ద్వారా ఫోన్‌లో ఆడియో రూపంలో రికార్డు చేసి సెప్టెంబర్ 10వ తేదీ లోపు ఈ-మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. అర్హత పొందిన గాయకులను ఎంపిక చేసి, ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గానం చేసేందుకు అధికారిక ఆహ్వానం పంపబడుతుందని, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రంతో పాటు తెలుగు మహాసభల పతకాన్ని అందజేస్తామన్నారు. ఎంట్రీలను ammapandu2026@gmail.com మెయిల్‌కు పూర్తి వివరాలతో పాటు, ఫొటో, రెండు కరోకే పాటల ఆడియోలను పంపాలని తెలిపారు. తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాల సౌందర్యాన్ని ఆవిష్కరించేందుకు, ప్రతిభావంతులైన గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిషత్తు కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహాసభల సమన్వయకర్త పి.రామచంద్ర రాజు కోరారు.

21న దేశవ్యాప్త అంగన్‌వాడీల నిరసన



లక్ష్మీపురం: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) పిలుపు మేరకు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి ఈనెల 21న దేశవ్యాప్త నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి పిలుపునిచ్చారు. పాత గుంటూరు సీఐటీయూ ఆఫీసులో సోమవారం అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సమావేశం జి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో నుంచి జీతాలు పెంచాలని, తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్టీ, ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలన్ని అమలు చేయాలని అన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి జీఓ ఇవ్వాలని, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన లాం గ్రామం అంగన్‌వాడీ వర్కర్ టి.సామ్రాజ్యంను విధుల్లోకి తీసుకుని, జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోరికల సాధన కోసం అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు నల్ల చీరలతో మానవహారాలు నిర్మించి, తహసీల్దార్‌కి వినతిపత్రం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీ నారాయణ, యూనియన్ జిల్లా నాయకులు రత్న మంజుల, చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.

కూటమికి కర్షకుల కష్టాలు పట్టవు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- కాకుమానులో నీట మునిగిన పంట పొలాల పరిశీలన
- పాలకుల తీరుపై మండిపాటు
- అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న అంబటి, బలసాని

కాకుమాను: మండలంలోని పలు గ్రామాలలో నీట మునిగిన వరి పొలాలను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ప్రత్తిపాడు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయని ఆయన తెలిపారు. ఇప్పటికే అనేక మంది రైతులు రెండు వరినాట్లు వేసి ఎంతో పెట్టుబడి పెట్టారని ఆయన తెలిపారు. వర్షం వలన నీట మునిగిన పంట పొలాలను పరిశీలించేందుకు పాలకులు కన్నెత్తి చూడకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పంట నష్టపరిహారం అందించి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు.

ఇప్పటికైనా పాలకులు మొద్దునిద్ర వీడి పంట నష్టపోయిన ప్రతి రైతుకి నష్టపరిహారం వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్నదాతలు ఆనందంగా ఉంటేనే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటారనే విషయాన్ని కూటమి ప్రభుత్వం మరచిందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని అబద్ధపు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి నాయకులు తమ తీరును మార్చుకుని రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కర్షకులు కన్నెరచేస్తే కూటమి ప్రభుత్వం కూలిపోవడం కాయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు నల్లమోతు శివరామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు కొమ్మాలపాటి రవికుమార్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, మైనార్టీ కన్వీనర్ పొన్నూరు షేక్ కరిముల్లా, వల్లూరి సుధాకర్, చిల్లిబాబు, పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

శివారులో మౌలిక వసతుల కల్పన

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్లు, త్రాగునీటి కుళాయి కనెక్షన్ల వంటి మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. నూతనంగా నిర్మాణం చేసే డ్రైన్లు తప్పనిసరిగా లెవల్స్ ఉండేలా, నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేయాలని, తమ పరిశీలనలో లోపాలు గుర్తిస్తే సంబంధిత అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కృష్ణా నదికి వరద నీరు వస్తున్నందున నగరంలో ప్రజలు త్రాగునీటిని కాచి చల్లార్చి వాడుకోవాలని తెలియచేస్తూ, ప్రతి సచివాలయం పరిధిలో శ్యాంపిల్స్ తీయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్ చుట్టుపక్కల నివాసాలు పెరుగుతున్నందున ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి నివాసితులకు దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెస్తున్నారని, సదరు ఖాళీ స్థల యజమానులచే స్థలాన్ని శుభ్రం చేసుకునేలా తెలియచేయాలని, స్పందించని వాటికి జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం రవీంద్ర నగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగేలా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు పర్యవేక్షణ చేయాలని, అనధికార, అక్రమ నిర్మాణాలను తొలిదశలోనే అడ్డుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- ముంపు పొలాల సందర్శన



ముంపుబారిన పడిన పొలాలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: భారీ వర్షాలకు వరి పంట నీట మునిగి దెబ్బతిని నష్టపోయిన రైతులకు వెంటనే 10 వేల రూపాయిలు పరిహారంగా, విత్తనాలు, ఎరువులను ఉచితంగా అందించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో సోమవారం భారీ వర్షాలకు ముంపు బారిన పడిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు, స్థానిక నాయకులతో కలిసి మోకాళ్ల లోతు నీటిలో ఉన్న పొలాల్లోకి వెళ్లి పరిశీలించి వారి కష్ట, నష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కురిసిన వర్షాలకు పొలాలు చెరువులను తలపించేలా మారాయన్నారు.

గత ఏడాది రైతులు పండించిన పంటకు పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి, గిట్టుబాటు ధరలు లేక నష్టాలు బారినపడ్డారన్నారు. రైతులకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలకు బ్లాక్ మార్కెట్టులో కొనుగోలు చేయాల్సి దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. వారం రోజులు గడిచినప్పటికీ రోడ్లు, డొంకలు మునిగిపోవటం, పొలాల్లోని నీరు బయటకు వెళ్లకపోవటానికి కారణం రాజధాని ప్రాంతంలో ఉన్న కొండవీటి వాగు, దాని ఉప వాగులు నుంచి వచ్చిన వరద నీరే పొలాల ముంపునకు కారణంగా రైతులు, గ్రామస్తులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యత్రాకుల వీరాంజనేయరాజు, మన్నెం వేణుగోపాలరావు, పరిశా చిరంజీవి, బాలచంద్రయ్య, ఎం.పోతురాజు, డి.రత్తయ్య, కోటిరాజు, పి.పూర్ణచంద్రరావు పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న అంబటి

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- పెదకాకాని వైఎస్సార్ సీపీ నాయకులు
- గుంటూరు కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదకాకాని: పంట దెబ్బతిన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం మంజూరు చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెదకాకాని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పెదకాకాని మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు చెరువుల్లా మారాయి. వర్షం కురిసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నంబూరు, గోళ్ళమూడి, వెంకటకృష్ణాపురం, తంగెళ్ళమూడి, దేవరాయబొట్లవారిపాలెం గ్రామ శివార్లలో వరి పొలాలు చెరువుల మాదిరిగానే ఉన్నాయన్నారు. ఈ వర్షపునీటిలో మునిగి ఉన్న వరిపైరు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అలానే పలు గ్రామాల్లో మెట్టపైర్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి 10 వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ నాయకులు దానబోయిన నాగేశ్వరరావు, ఆర్ధల గడ్డేశ్వరరావు, మున్నంగి రాంబాబు, సుబ్బారావు, యడ్లపల్లి రమేస్, అంకమ్మరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన కొలుపుల మహోత్సవం

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళ వారి శ్రీ తినంకమ్మ తల్లి కొలుపుల మహోత్సవం సోమవారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్దెత్తున పాల్గొని అమ్మవారికి పొంగళ్ళను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో వేలాదిగా భక్తులు అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

బాలుర వసతి గృహాల్లో పే అండ్ యూజ్ పద్ధతిలో వాషింగ్ మెషీన్లు ఏర్పాటు



వాషింగ్ మెషీన్లను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యు): విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక విసి ఆచార్య గంగాధర్‌రావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వాషింగ్ మెషీన్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య గంగాధర్ రావు మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాషింగ్ మెషీన్లు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థుల సమయం కూడా ఆదా అవుతుందని చెప్పారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నా శిలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. హైయర్ గ్రూప్ కార్పొరేషన్ సారథ్యంలో 35 వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేశారన్నారు. పే అండ్ యూజ్ పద్ధతిలో విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. హైయర్ కంపెనీ న్యూఢిల్లీ మేనేజర్ హర్ష, ఏపీ, తెలంగాణ సౌత్ మేనేజర్ ఎస్ మనోజ్ కుమార్, మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులు , కొంత నగదును పే చేసి, వాషింగ్ మిషన్ ఆపరేట్ చేసే వెసులుబాటు ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య మల్లికార్జున, ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య లింగరాజు, ఆచార్య ప్రమీలరాణి, డిప్యూటీ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వర్లు, అదనపు ఇంజనీర్లు సతీష్ ధనుంజయ్, సాయి, సీడీసీడీఎస్ ఆచార్య రవికుమార్, వార్డెన్ డాక్టర్ శ్రీనివాసరావు, అడిషనల్ వార్డెన్స్ డాక్టర్ ఎస్.బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ పుణ్యశేఖర్, రెసిడెన్షియల్ వార్డెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయం.. కసుకర్రు ప్రధాన రహదారి



ఇదే కసుకర్రు ప్రధాన రహదారి

- వాహన చోదకులకు ఇబ్బందులు
- పట్టించుకునే వారు కరువు

పొన్నూరు: మండలంలోని పలు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా కసుకర్రు ప్రధాన రహదారి గుంతలకు చిరునామాగా దర్శనమిస్తోంది. మలుపుల్లో ప్రమాదకర గుంతలు ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం చిన్నపాటి గుంతలను పూడ్చేందుకు ప్రజా ప్రతినిధుల ఆదేశాలు తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఫలితంగా అధ్వాన రోడ్లపై ప్రజలకు అవస్థల ప్రయాణం తప్పడం లేదు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే రోడ్లన్ని మడుగులను తలపిస్తున్నాయి. కసుకర్రు గ్రామ ప్రారంభం నుంచి శివారు వరకు ప్రధాన మార్గం గుంతలతో నిండి ఉంది. ఈ మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో ప్రయాణికులు గుంతల రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రహదారి మలుపులో ఏర్పడిన గుంత

వానొచ్చె... వరదొచ్చె!!

అసౌకర్యాల నడుమ జనజీవనం

పొన్నూరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొన్నూరు పట్టణంలోని రోడ్లు, పలు ప్రాంతాలు చెరువుల్లా మారుతున్నాయి. పూడిక తొలగించకపోవడంతో కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. వేలాది కుటుంబాల నుంచి రోజువారిగా మురుగు పారుదలకు వీలుగా పూర్తిస్థాయిలో డ్రెయిన్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలు అసౌకర్యాల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. రజక కాలనీ, రవి కాలనీ, డీవీసీ కాలనీ, ముబారక్ నగర్, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో మురుగుపారుదలకు మార్గాలు సక్రమంగా లేకపోవడంతో వర్షాలు వచ్చాయంటే అధ్వాన పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీస్థలాలు, పెద్ద భవంతుల మధ్యలో లోతట్టు ప్రాంతాల్లో పిచ్చి మొక్కలతో మడుగులను తలపిస్తున్నాయి. రోడ్లపై నిలుస్తున్న నీటిని దాటిపోవాలంటే నరకప్రాయంగా ఉందని వాహనచోదకులు, పాదాచారులు మండిపడుతున్నారు. పాచిపట్టిన మడుగుల్లో పిచ్చి మొక్కలు దుర్వాసన, విష పురుగుల సంచారంతో స్థానికులు భయపడుతున్నారు.

కాల్వల్లో కలదలని సిల్టు

ఇళ్ల ముందు కాలువలు ఉన్నా మురుగు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా విజృంభిస్తున్న దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సకాలంలో పూడికతీత, ఇంటింటి చెత్త సేకరణ లేక వీధుల్లో అపరిశుభ్రత సమస్యలు ఉంటున్నాయి. కంటి తుడుపుగా వీధుల్లో కాలువల నిర్మాణం చేపట్టినా మురుగు పారేందుకు ముందుచూపు లేకపోవడంతో మురుగు సమస్య సంక్లిష్టంగా తయారైంది.

ఏటేటా ఇదే సమస్య

ఏటా వర్షాకాలంలో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా మున్సిపల్ అధికారులు తమకేం పట్టలేదన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముందస్తు చర్యలలో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతకు రూ. లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం ఉండటం లేదు. తాత్కాలిక చర్యలతో నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అధికారులు స్పందించి శాశ్వత చర్యల దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ముబారక్ నగర్‌లో స్తంభించిన వర్షపు నీరు



నీటిలో మునిగిన ద్విచక్ర వాహనాలు



కనిపించని రహదారి

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన మల్లెల కృష్ణా కుమార్తె గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. అయితే ఈనెల 6వ తేదీన హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయం తెలుసుకున్న వనిత కుటుంబ సభ్యులు గుంటూరు, పల్నాడు ప్రాంతాలలో వెతుకలాడిన ఎంతకు ఆచూకీ తెలియకపోవడంతో వనిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు 8688831332, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863-2231955లకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు జిల్లా ఐక్య వేదిక చైర్మన్ చాంద్‌బాషా



గుంటూరు వెస్ట్: ఎంతోకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఉద్యోగులతో మాట్లాడారు. బుధవారం నిర్వహించనున్న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో విస్తృత చర్చలు ఉంటాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై కేబినెట్ సభ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు, విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 12వ వేతన సవరణ కమిటీని సిట్టింగ్ జడ్జితో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు వెంటనే ఐఆర్ 29 శాతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ కౌన్సిలింగ్ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.